క్లుప్తంగా

కుల సంఘాలతో సమావేశం


నినాదాలు చేస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని దుంపేటలో శుక్రవారం పలు కులసంఘాలను కలిసి మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ప్రచారం చేశారు. గ్రామంలోని గీత కార్మిక, వడ్డెర, రజక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కులసంఘాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు జెల్ల వేణుగోపాల్, ఎం.డీ రఫీ, భూపెల్లి రాకేశ్, ఉడుగుల ఓంకార్, ఆకుల లక్ష్మనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగ పర్యటన విజయవంతం చేయాలి


కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

సారంగాపూర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ బెజ్జంకి సతీష్ మాదిగ అన్నారు. మంద కృష్ణ మాదిగ పర్యటనపై గ్రామాల్లో శుక్రవారం పర్యటించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలమంటూనే కాలయాపన చేస్తున్న పార్టీలకు నిరసన తెలపడానికి మంద కృష్ణ శనివారం జిల్లా కేంద్రానికి వస్తున్నారని భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మీసాల చంద్రయ్య, బెక్కం శంకర్, అరికిళ్ల రాజన్న, దుబ్బయ్య, సంతోష్, గంగాధర్ పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కోరుట్ల రూరల్: ఓటు హక్కు వినియోగంపై మండలంలోని మోహన్‌రావుపేటలో కళాకారులు శుక్రవారం అవగాహన కల్పించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ ఆటా, పాటలతో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి, బీఎల్‌వోలు, కళాకారులు రాగుల పరశురామ్, ఎములవాడ మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల అభివృద్ధికి కలిసి పనిచేద్దాం



సారంగాపూర్: మున్నూరు కాపుల అభివృద్ధికి కలిసి పనిచేయాలని సంఘ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో మండల మున్నూరు కాపు సంఘ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఐక్యతతో ముందుకు సాగితే అభివృద్ధి సాధ్యమని అన్నారు. సమావేశ అనంతరం యువజన విభాగ కమిటీని ఎన్నుకున్నారు. యువజన విభాగం అధ్యక్షుడిగా మ్యాడ శ్రీనివాస్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా మసర్తి శేఖర్, ఉపాధ్యక్షులుగా రామకిష్టు సతీష్, గురునాథం నరేష్, కోశాధికారిగా చీర్నేని మహేష్, సైండ్ల సభాష్, తాటి నాగరాజు, సలహాదారులుగా మెండు హరీష్ పటేల్, మరిపెల్లి శ్రీనివాస్, చిందం రమేష్ నియమితులయ్యారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి


రాజమ్మ

ధర్మపురి: సద్దుల బతుకమ్మలతో పాటు దసరా, దీపావళి పండుగలను భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోకనపెల్లి రాజమ్మ కోరారు. పండుగల సందర్భంగా మహిళలకు, ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.


జగిత్యాలలో సామూహిక సరస్వతీ పూజలో పాల్గొన్న భక్తులు


లచ్చక్కపేటలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


పెగడపల్లిలో...


కుస్తాపూర్‌లో అన్నదానం చేస్తున్న దాతలు

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

జగిత్యాల/జగిత్యాల టౌన్/ జగిత్యాల రూరల్/ కోరుట్ల/ కోరుట్ల రూరల్/కోరుట్ల టౌన్/ధర్మపురి/గొల్లపల్లి/ రాయికల్/ ఇబ్రహీంపట్నం/కథలాపూర్/పెగడపల్లి/సారంగాపూర్/మెట్‌పల్లి/ మెట్‌పల్లి రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గా మాత శుక్రవారం సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రం, రాయికల్, కోరుట్ల పట్టణం, కోరుట్ల మండలం, మెట్‌పల్లి పట్టణం, మండలం, ఇబ్రహీంపట్నం,కథలాపూర్,పెగడపల్లి, సారంగాపూర్ మండలాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నదానాలు, కుంకుమపూజలు చేశారు. పలు చోట్ల రథోత్సవం, బోనాలు, బోనాల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


సత్తక్కపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు


మాదాపూర్‌లో దుర్గమ్మ బోనాల్లో జెడ్పీటీసీ లావణ్య


ఇబ్రహీంపట్నంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం


సిరికొండలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


లొత్తునూర్‌లో అమ్మవారికి 108 రకాల నైవేద్యాలు


బోర్నపల్లిలో చిన్నారులకు అక్షరాభ్యాసం

బీఆర్ఎస్ హయాంలో కోరుట్ల ఎంతో అభివృద్ధి


వ్యాపారులను ఓటు అభ్యర్థిస్తున్న కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: బీఆర్ఎస్ హయాంలో కోరుట్ల నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలో తన తనయుడు, బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారులను కలిసి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా తనను గెలిపించారని, అలాగే తన కుమారున్ని కూడా ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షాల మాటలు నమ్మకుండా బీఆర్ఎస్‌కు అండగా నిలవాలన్నారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో మల్లాపూర్ మండలానికి చెందిన యువకులు సంజయ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

గాయత్రి బ్యాంక్‌లో మెరుగైన సేవలు


బ్యాంకును ప్రారంభిస్తున్న ఆర్‌బీఐ మేనేజర్

జగిత్యాల: గాయత్రి బ్యాంక్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ వినియోగదారుల ఆర్థిక ప్రగతికి చేయూతనిస్తుందని రిజర్వ్‌బ్యాంక్ జనరల్ మేనేజర్ ప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో గాయత్రి బ్యాంక్ మరో బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో జగిత్యాలలో ప్రారంభమైన బ్యాంక్ మల్టీ స్టేట్ బ్యాంక్‌గా రూపొందిందన్నారు. కార్యక్రమంలో చైర్మన్ ముత్యాల లక్ష్మణ్‌రెడ్డి, సీఈవో వనమాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాహుల్ సభకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు


రాహుల్‌గాంధీ రోడ్‌షోకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

సారంగాపూర్: జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సభకు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. కార్యకర్తలు, ప్రజలు సభకు వెళ్లారు.

జగిత్యాలటౌన్: రాహుల్‌గాంధీ జగిత్యాల పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ధరూర్ నుంచి జగిత్యాల కొత్త బస్టాండ్ వరకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లపల్లి: రాహుల్ గాంధీ రోడ్‌షోకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తల భారీ ఎత్తున తరలివెళ్లారు. ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్‌కు మద్దతుగా తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు నిషాంత్‌రెడ్డి సర్పంచులు నాయకులు తరలివెళ్లారు.

బీఆర్ఎస్‌తోనే సుస్థిరపాలన


సంగెం-శ్రీరాంపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

మల్లాపూర్: బీఆర్ఎస్‌తోనే ప్రజలకు సుస్థిర పాలన అందుతుందని బీఆర్ఎస్ ఎస్టీసెల్ జిల్లా నాయకులు ఎల్కా కమలాకర్, బెజ్జారపు సాయికుమార్ అన్నారు. మండలంలోని సంగెం-శ్రీరాంపూర్‌లో శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌కి మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడినంగా బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని ప్రజల సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో తోడ్పాటును అందించారని కొనియాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు చాలా వరాలు ప్రకటించారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌ను అత్యధిక మెజార్టీతో గెలుపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల సురేశ్, అరుణ్‌కుమార్, అన్వేష్, బాబాన్న, సంజీవ్ రెడ్డి, సాజన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ఓటర్ కార్డులు పంపిణీ

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ గ్రామంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు భారత ఎన్నికల సంఘం జారీ చేసిన డిజిటల్ కార్డులను సర్పంచ్ వంతడుపుల అంజయ్య శుక్రవారం అదించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలి

గొల్లపల్లి: ధర్మపురి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని పీఏసీఎస్ చైర్మన్ రాజసుమన్‌రావు పిలుపునిచ్చారు. గొల్లపల్లి మండలం రాఘవపట్నంలో ఇంటింటికీ తిరిగి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ బోయపోతు గంగాధర్, సర్పంచ్ రాగం శంకరయ్య, పార్టీ మండల అధ్యక్షుడు క్యాతం రవీందర్, సర్పంచ్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ధర్మపురి: సద్దుల బతుకమ్మ, దసరా పండుగల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ధర్మపురి పట్టణంలో ఈనెల 22న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గోదావరి తీరాన బతుకమ్మ నిమజ్జన వేడుకలను నిర్వహించడానికి స్థలం పరిశీలించారు. బతుకమ్మలను తీసుకెళ్లే ప్రదేశాలను సందర్శించి అక్కడ కావల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. గుంతలు ఉన్న చోట్ల ట్రాక్టర్ల ద్వారా మొరం పోయించి లెవల్ చేయించారు. అదే విధంగా రోడ్ల కిరువైపులా సున్నంతో మార్కింగులు చేయించారు. ముఖ్యంగా గోదావరిలో ఎల్లంపెల్లి బ్యాక్ వాటర్ అధికంగా ఉన్నందున భక్తులు లోనికి వెల్లకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచనున్నారు. గోదావరి తీరంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించారు. అదే విధంగా దసరా పర్వదినం సందర్భంగా కమలాపూర్ రూట్‌లో ఉన్న జంబిగద్దె వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్స్‌పెక్టర్ గంగాధర్ తదితరులున్నారు.

పేదల కనీస అవసరాలు తీర్చడంలో బీఆర్ఎస్ విఫలం


మాట్లాడుతున్న హరీశ్‌గౌడ్

కథలాపూర్: పేదలకు కనీస అవసరాలు తీర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ధర్మ సమాజ్ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం హరీశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కథలాపూర్‌లో ఆ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో బడుగు బలహీన వర్గాల ప్రజలు అధికసంఖ్యలో పాలుపంచుకున్నారని, పదేళ్లలో పేదలకు సరైన విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు వంటి ప్రాథమిక అవసరాలు కల్పించలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌పార్టీలు ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. సబ్బండ కులాల స్వరాజ్యాన్ని సాధించడం కోసం కృషి చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు రమేశ్, రాజేందర్, గంగరాజం, కైలాస్, సతీశ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెట్‌పల్లిలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యటన

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో బహుజన రాజ్యాధికార గర్జన బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూదరి నిషాంత్ కార్తీకేయ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ సభకు రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నారని, దీనిని విజయవంతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

సింహ వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు



కోరుట్ల: పట్టణంలోని అష్ట లక్ష్మీ ఆలయంలో స్వామివారు భక్తులకు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. పురాతన శ్రీవేంకటేశ్వర ఆలయంలో శ్రీదేవి-భూదేవి సమేత శ్రీనివాసుడిగా దర్శనమిచ్చారు.

నగదు పట్టివేత

గొల్లపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా కారులో తరలిస్తున్న 1.30 లక్షలు, పికప్ గూడ్స్ వాహనంలో రూ. 56,600 డబ్బులు సీజ్ చేసి ఎఫ్ఎస్‌టీ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

ఆలయంలో మంత్రి సతీమణి పూజలు

గొల్లపల్లి: మండలంలోని రంగదామునిపల్లి భక్త మార్కండేయ ఆలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి కొప్పుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ స్నేహలత, కుమార్తె నందిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ కమిటీ సభ్యులు, దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడి రాజీనామా


మాట్లాడుతున్న చక్రపాణి

వెల్గటూర్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల మల్లేశం ఒంటెద్దు పోకడలతోనే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బీజేపీ ఉమ్మడి వెల్గటూర్ మండల అధ్యక్షుడు తంగళ్లపల్లి చక్రపాణి అన్నారు. ఎండపల్లిలో శుక్రవారం మాట్లాడారు.ఆరేళ్లుగా తాను బీజేపీ పార్టీ ఉమ్మడి వెల్గటూర్ మండలాల అధ్యక్షుడుగా కొనసాగుతున్నానని, పార్టీలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని అన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడుగా ఉన్న గాజుల మల్లేశం, కస్తూరి సత్యం ఒంటెద్దు పోకడలు భరించలేక తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానన్నారు. మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధతో పార్టీని విడిచి వెళ్తున్నానని తెలిపారు. తన అనుచరులతో మాట్లాడిన అనంతరం కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

బతుకమ్మ సంబురాలు


బతుకమ్మలతో వస్తున్న మహిళలు

ధర్మపురి: బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏడో రోజు వేపకాయల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధర్మపురితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏడో రోజున బియ్యం పిండిని వేయించి వేప పండ్లుగా తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ధర్మపురిలోని గోదావరి తీరంలో మహిళలు బతుకమ్మ ఆట పాటలతో సందడి చేసి గోదావరిలో నిమజ్జనం చేశారు.